సీతమ్మ తల్లి

రంధి సోమరాజు

సీతమ్మకు ఒక కొడుకూ, ఒక కూతురూ ఉన్నారు. కూతురుపేరు సుబ్బమ్మ. తల్లి ఆమెను ముద్దుగా 'సుబ్బులూ' అంటుంది. కొడుకుపేరు రామారావు. వాడు చదువుకుంటున్నాడు. హైస్కూలుకు రోజూ వెళ్తూ వస్తున్నాడు.

సీతమ్మకు కూతురువల్ల ప్రస్తుతం ఏ బాధా లేదు. ఆమె పెళ్లి ఎప్పుడో జరిగిపోయింది. పైపెచ్చు ఇప్పుడా కూతురే ఇంటికి పెద్ద కొడుకులా ఉపయోగపడుతూంది. ఇక ఆమె కొక కూతురుకూడా ఉంది. ఆ పిల్ల పేరు చిట్టి. చిట్టి మూడోతరగతి ముచ్చటగా చదువుకుంటోంది.

సీతమ్మ చాల గడసరి. తినడానికి ఏమీ లేకపోయినా, బడాయి కబుర్లు బహు చక్కని మిఠాయిఉండల్లాగచేసి, చుట్టుప్రక్కలవారికి రోజూ ఫలహారంగా పెడుతుంది. వట్టి మాటలకోసం చేరేవారికి ఆమె కబుర్లు తియ్యగాఉంటే ఉండొచ్చేమోగాని, తదితరులకు ఆమె అన్నా.. ఆమె మాటలన్నా ఎంతో ఏవగింపు. పూటకు తికాణా లేదుకాని, మాటలు చూస్తే కోటలు దాటతాయని ఆమెను అసహ్యించుకుంటారు.

నిజానికి సీతమ్మకు కుటుంబం గడవడమే చాల కష్టమైపోతోంది. పాపం ఆమె రోజూ ఈ విషయమై ఆలోచిస్తూనే వుంటుంది. తనకూ, తన కొడుక్కూ తిండి కావాలి. బట్టలు కావాలి. ఇంటద్దె కావాలి. చదువుకు జీతం కావాలి. పుస్తకాలకు డబ్బుండాలి. ఇవన్నీ ఎలా జరుగుతాయి? ఇవన్నీ ఎలా సాగుతాయి? ఆ చచ్చిపోయిన పెద్దమనిషి చిల్లిగవ్వ మిగల్చకుండా 'హరీ' అన్నాడు. అతను బ్రతికుండగా చేసిన ఘనకార్యమల్లా అమ్మాయిని ఇంత ఉన్నవాడికి ముడివెయ్యడంతో సరిపోయింది. దానితో అతని పని అయిపోయిందనుకున్నాడు. ఈ భార్య ఏమైపోవాలి... ఈ కుర్రకుంక ఏం కావాలి... అన్న బెంగేనా లేకుండా చల్లగా దాటుకపోయాడు. ఈభారమంతా తనెల్లా మోయగలదు? నోరుందంటేనే అయిపోతుందా? ఊళ్లో చిల్లిగవ్వ అప్పు పుట్టదు. అయితే ఏం...? సంసారాన్ని ఓ ఒడ్డుకు ఎట్టాగో అట్టాగ లాక్కొస్తూంది. ఇందుకనే ఏనుగంత తండ్రి ఉండేకన్నా...ఏకులబుట్టంత తల్లి ఉంటే చాలన్నారు. ఇదే అయన్నైతేనా...ఎప్పుడో సన్యాసుల్లో కలిసిపోయేవాడు. ఇప్పుడీ బాధంతా తనమెడకు చుట్టుకుంది; అనుకుంటూ ఒక్కొక్క అర్ధరాత్రి ఆమె నిట్టూర్చేది. అలాగని ఆమెనిబ్బరం ఎప్పుడూ సడలిపోలేదు.

సుబ్బులు కాపురంకూడ ఆ వూళ్లోనే. అందువల్ల, సీతమ్మబాధ సగం ఉపశమించింది. రోజూ ఆమెదగ్గరకు పోయి అన్నం, కూరలూ తెచ్చుకొనేది. అవి తెచ్చేప్పుడు ఎవరేనా చూస్తారేమో అని, పెద్దపవిటచెంగులో వాటిని కప్పితెచ్చేది. అప్పటికీ 'ఏమిటండీ పిన్నిగారూ...అలా పట్టుకెళ్తున్నారు' అని ఎవరేనా అడిగారంటే... పాపం ఏం జేస్తుంది. ఏదో ఒకటి జవాబు చెప్పాలిగా ...... "ఏముందమ్మ ... మా అల్లుడిగారింటిదగ్గర ఒకటుంటే, ఒకటుండదు. అది రోజూ పోరుపెడ్తూనే ఉంటుంది ఇంట్లో టిఫినికేరేజి అవసరం ఉందని. కొని కొనడుగా...దుకాణం దగ్గరకు మాత్రం భోజనం కేరేజిలోతప్ప పంపొద్దని ఆజ్ఞలేస్తూ వుంటాడు. అది మరి కారేజి ఎక్కడనుంచి తెస్తుంది? ఎవరుగాని ఇస్తారు? ఈ వూళ్లో తమ వస్తువులు మరొకళ్లకిచ్చేవాళ్లుగూడ ఉన్నారటమ్మా... మాయముండావూరు. ఎవరిదగ్గరేనా వుంటే, తేరగా వడేసుకుందామనే వుంటుందిగాని, అవసరానికింత ఆదుకుందామని ఉండదుకదా...టిఫిను కేరేజి ఇచ్చినంతమాత్రాన వాళ్లి సొమ్మేం పోతుందో... అరిగిపోతుందా ... చిరిగిపోతుందా...నే నెప్పటికీ అంటూవుంటాను. ఎందుకే అడ్డమైనవాళ్లనూ అడుగుతావు... మన ఇంట్లో ఉందికదా....నన్నడిగి పట్టుకపోరాదూ...అని; దానికేముందో తెలుసా తల్లీ...'అదికాదే అమ్మా....అందరి మనసులూ ఒక్కలాగుండవు. ఒకందుకు పోస్తే, ఒకందుకు త్రాగాడని; నువ్వు ఒకందుకిస్తావు. తిరిగి నేను దాన్ని నీకిచ్చేసేప్పుడు, ఈ ఇరుగు పొరుగు అమ్మలక్కలు ఏమనుకుంటారో తెలుసా...చూడండి.... అమ్మగారి కెలా దోచిపెట్టుందో అని ఆడిపోసుకుంటారు' అంది. చూడు అమ్మాయి... పుణ్యానికిపోతే పాప మెదురైందని; లోకం వరుస ఇలా వుంటుంది. కూతురును తల్లి చూడకూడదు. తల్లి కూతురును చూడకూడదు. తల్లి కూతురుకు ఏమి పెట్టినా పెట్టొచ్చుగాని, కూతురు సొమ్ము తల్లి ఇంతకూడ తినకూడదు. ఇంతకీ ఆ మారాజు మాకింత ఏదో ఇచ్చిపోయాడూ. ఆయనగారి ప్రావిడెంటు ఫండూ, ఇన్సూరెన్సుడబ్బూ...వాటిమీద రాలే వడ్డీ డబ్బులు...మాకు చాలవూ... మేం మాత్రం ఎంతమంది వున్నాము. మా కవే ఎక్కు తక్కు. ఇంతకూ నీకు తెలుసు కాబట్టి నువ్వు నమ్ముతావు. వాళ్ళకేమితెలుసమ్మ ....నాలుక ఎటు తిరిగితే అటే మాటలంటారు' అంటూ అక్కడనుంచి కదిలిపోతుంది.

కదిలిపోతూ...కదిలిపోతూ..విచిత్రంగా నవ్వుతుంది. నవ్వి 'చూశే...అమ్మాయి... అవునుగాని, నువ్వు నీళ్లోసుకున్నావటగా ...నువ్వు చెప్పకపోతే అయిపోయిందనుకున్నావటే' ...ఇప్పటి పిల్లలకదేమిటో గాని, ఇంత లేసి సిగ్గులేమిటమ్మ...అంటూ ఇంటికి దారితీస్తుంది. ఆ అమ్మాయిని అలా పూర్తిగా ఉడ్చేసి, తనంటే ఎక్కడలేని ప్రేమ, ఆమె ఒలకబోసేట్టు మరీచేసుకొని తృప్తిపడుతుంది.

ఇక ఉన్నకొస్త డబ్బూ వడ్డీలకు తిప్పుతూ వుంటుంది. పేదవాళ్ల అవసరాలు ఆమెకు ఘోరమైన తప్పులుగా కనిపిస్తాయో ఏమో...కనీ వినీ ఎరుగని వడ్డీలు,ఆ తప్పులకు శిక్షలుగా విధించి, తన జీవితాన్ని సులాగ్గా ఓ ఒడ్డుకు ఈడ్చుకొచ్చేస్తూంది.

సీతమ్మకు కూతురుమీదకూడ అంత నమ్మకం లేదు. తను రోజూ ఆమెదగ్గరకు పోయి, ఏదో ఒకటి తీసుకొని వస్తూండటం కూతురైతే మాత్రం ఎన్నాళ్ళు సహిస్తుందని—ఆమెనుకూడ ఓకంట కనిపెడుతూనే వుంటుంది. అప్పుడప్పుడు, 'మీ నాన్న ఉంటే ఎందుకమ్మ నాకీ కష్టాలు.... ఆ వెధవని ఓ దారిలో పెట్టి, ఓ ఇంటివాణ్ణి చేసేవరకూ, ఎవ్వరేమన్నా నోరు నొక్కుకొని పడిఉండక తప్పేట్టు లేదు. లేకపోతే ఎప్పుడైనా చూశావటే ఆ ముదనష్టపు[illegible]ళ్ళందరిలోనూ [illegible]ను మాటలుపడటం? నువ్వు ఇంతకూ [illegible] ఏం పెట్టేస్తున్నావనే...అందరూ అలా రాలిపోతున్నారు. పెద్దకూతురు పెద్దకొడుకుతో సమానంగదా.. నువ్వు ఈమాత్రం సహాయం చెయ్యకపో

★ సీతమ్మ తల్లి ★

కదూ...మన సూర్యనారాయణే బ్రతికి వుంటే...నన్ను అడుగుతీసి అడుగు వెయ్యనిచ్చేవాడటే...దేవుడు నన్నైనా తీసుక పోయాడు కాదు. పాపిష్టిదాన్ని ఇంత బ్రతుకూ బ్రతికి అడ్డమైనవాళ్ళందరితోనూ నేనెందుకు చెప్పమాటలు పడటం? కుటుంబంలో ఒకరికి కష్టాలొస్తే ...ఒకరు ఆదుకోరూ...కష్టాలు మనకే వచ్చాయా...వాళ్ళకు రావూ...నువ్వు ప్రతిదానికీ అంత భయపడకూడదే అమ్మాయి...మన డబ్బు ఇష్టమొచ్చినట్లు చేసుకుంటాం.. ఆ బయిట వాళ్ళకెందుకు చెప్పూ దుగ్ధ! పోనీ వాడేమయినా పరాయివాడా...నీ తమ్ముడేగా...వాడికి చిట్టినిచ్చి పెళ్ళిచేస్తావుగదా...ఎవరో ఏదో అనుకుంటారని, మరి నువ్వుకూడ అలా భయపడి పోతే ఎలా చెప్పు...' అనేది.

అప్పుడప్పుడు, 'మీ ఆయనకు మరీ అంత ఒదిగి ఉండకే తల్లీ...రేపో మాపో మళ్ళీ ఓ బిడ్డతల్లివి కాబోతున్నావు. నీకామాత్రం స్వతంత్రం లేదటే...నీకు ఏవి కావలిస్తే అవి కొని తెప్పించుకో...అలా మెత్తగా ఊరుకుంటే ఎలాగే...అయ్యో పిచ్చితల్లీ.. నా కడుపు నెలా పుట్టావే...మరీ అంత మెతకా..;అసలే అల్లుడికి చరాకూ అదీ హెచ్చు. జేబులోనే డబ్బులవీ ఉంచేసూ ఉంటాడు. ఏ దాసీపిల్లో చూసిందంటే చూడు...అవి కాస్తా కాజేస్తుంది. నువ్వు కొంచెం వేయికళ్ళతో కనిపెట్టుకొని చూస్తూ వుండాలి. నీకు ఇబ్బంది లేకపోతే, రాత్రి వాటిని నీ పెట్టెలో దాచి, ప్రొద్దున్నే అతను కొట్టువద్దకు వెళ్ళేప్పుడు తీసి ఇస్తూంటే సరి. నీకు ఏమీ తెలియదే.. అన్నీ చెప్పాలి...' అంటుంది. అలా అనీ, 'చూడు సుబ్బులూ..తమ్ముడి జీతం కట్టాలి. ఓ అయిదు రూపాయలుంటే ఇవ్వు' అని మెల్లగా పుచ్చుకొని ఇంటికి వెంచేస్తుంది.

2

ఇలా అగని కాలంతో పాటు సీతమ్మ కూడ ఆగకుండా సంసారాన్ని దొర్లించుకు పోతూంది.

ఈలోగా రామారావు స్కూలు ఫైనలు ప్యాసయ్యాడు. చిట్టి భర్తఘారంలోకి వచ్చింది. ఇక ఆమె అల్లుడు కొత్తగా ఒక లారీ కొని యజమాని అయ్యాడు. దీనితో సీతమ్మ కూతురు ఓ పిల్ల జమీందారిణి స్థాయి లోకి వచ్చింది.

ఇప్పటివరకు సీతమ్మ తన కొడుకు చదువు స్కూలు ఫైనలుతో ఆపు చేసెయ్యాలనుకుంది. కాని ఇప్పుడా విషయం విరమించుకుంది. మెల్లగా కూతురుదగ్గర చేరింది. కాని వెంటనే, కూతురువల్ల ఈ పని కాదు అనుకొని, అల్లుడితోనే ఆ విషయమై కదిపింది. 'అబ్బాయి స్కూలు ఫైనలు ప్యాసయ్యాడు' అంటూ.

అత్తగారితో ఎక్కువగా మాట్లాడే అలవాటు, పాప మా అల్లుడికి ఎప్పుడూ లేదు. కాని అతనికి అత్తగారి వాగ్ధోరణి బాగా తెలుసు. ఆమె ఎదురుగుండా ఆమె మాట తీసెయ్యడం బహు కష్టం. కాని మెల్లగా, 'మునిసిపాలిటీలోనో, డిస్ట్రిక్టుబోర్డులోనో ఎక్కడో ఓ దగ్గఱ ఉద్యోగం దొరికేట్టు చూస్తానండి' అన్నాడు; అత్తగారింతకన్నా ఎక్కువ కోరదనుకున్నాడు కాబోలు.

వెంటనే ఆ అత్తగారు అందుకుంది. 'అదేమిటి నాయనా! నువ్వుకూడ అలా అంటావు.'

పాప మా అల్లుడు ఆమెవైపు బిత్తర చూపులు చూస్తూ ఉండిపోయాడు.

ఇక ఆమె మొదలుపెట్టింది. 'కష్టానికైనా...సుఖానికైనా ... ఇక నువ్వేగదా నాయనా మాకు ...నా డిప్పుడింతవాడయ్యేడంటే నీ చలవవల్లే కదా..ఏమాట కావాలే చెప్పుకోవాలి. మాకు నువ్వు చేసిన సాయం ....ఇందఱున్నారు బంధువులు ఒక్కరు గాని చేశారా...ఎలాగైనా నీ సాటి వాళ్ళెలా వస్తుంది! చిట్టిని తమ్ముడికిచ్చుకోవాలని అదేమో తెగ ఉబలాటపడుతూంది. వా మట్టుకు నాకు చిలకా గోరింకల్లాగ ఉంటారు...వీళ్ళిద్దరికీ ఆ మూడుముళ్ళూ ఎప్పుడు పడతాయా అని ఆ శ్రీమన్నారాయణమూర్తికి దణ్ణం పెట్టుకొని రోజూ లేద మకో...అయితే మన మనుకున్నంత మాత్రంలో అన్నీ అయిపోతాయా....కాలం కలిసిరావాలి. వాడేమో బి. ఏ. వరకూ చదువుతానని, తెగ మొరాయిస్తున్నాడు. పూట గడవడమే కష్టమైపోతూంటే ఎందుకు నాయనా ఈ చదువులు...అంటే వాడేమిటో విక్కమొగ మేశాడు నాయనా ...అయానే ఉంటే నోరువిడిచి చదువుకుంటానంటున్న కుర్రాడ్ని అలా గాలికి విడిచిపెట్టేసేవాడా...అని కళ్ళనీళ్లు పెట్టుకున్నాను. ఆడముండని; నేనంతకన్నా ఏమి చేయగలను? నాదగ్గఱ ఇలా గుణుస్తూ కూర్చోకపోతే, పోయి మీ బావగార్నడగరాదటరా...అంటే – అదేమిటో వాడికి సిగ్గట నాయనా...నీ దగ్గఱే సిగ్గయితే, ఇక వాడు ఎందుకు పనికివస్తాడూ అని. ఏదో ఈ నాలుగేళ్లుపోతే, పిల్లకూడ కొంచెం ఎదుగుతుంది. అప్పటికి వాడు బి. ఏ., అది స్కూలుఫైనలూ, ప్యాసయితే వాళ్ళ దాంపత్యం ఇక చెప్పతరమా నాయనా... పూర్వకాలంలో ఏముంది? చదువూ లేదు. సంధ్యా లేదు. మా మాటా... మేమూ... ఎంతో మొరటుగా ఉంటాము. మాకు నాజూకు ఏం తెలుస్తుంది. నా కేమిటో ఈ చదువుకున్న వాళ్లనుచూస్తే ఎప్పుడూ ముచ్చటేస్తుంది. వాళ్ల శుభ్రత, వాళ్ల మాట నాణ్యత నా బోటి దానికి రమ్మంటే వస్తుందా...ఎంత నెమ్మదిగా ఉంటారు... ఎంత పొందికగా ఉంటారు...' అంది.

అల్లుడు సుబ్బారావు గొంతుకలో వచ్చి వెలక్కాయ పడింది. నాలుగు సంవత్సరాలు చదివించడానికి, ఒక కుటుంబాన్ని పోషించడానికి, తనుమాత్రం కోటీశ్వరుడా ఏం? పైన పటారం లోన లొటారం అని, లారీ కొన్నంతమాత్రాన, అయిపోయిందా.. దీనికి ఎన్ని అప్పులు చెయ్యలేదు.! ఆ అప్పుల్ని తీర్చి క్షేమంగా, బయటపడి నప్పుడు గదా...అనుకుంటూ మాటా మంతీ లేకుండా ఉండిపోయాడు.

అప్పుడే, 'ఏం నాయనా...వాణ్నెక్కడకు పంపేదా...' అంది అత్తగారు.

వెంటనే అతను జవాబు చెప్పలేకపోయాడు. కాని చిట్టినిచ్చి ఆ అబ్బాయికి పెళ్ళిచేస్తాముకదా అనుకున్నాడు. మెల్లగా 'సరేనండి' అన్నాడు ఇక చేసేదేమీ లేనట్లు; అక్కడే మంచంమీద పడుకొని నిద్రపోతూన్న బాబువైపు దృష్టి ప్రసరించి.

వచ్చిన పని సాధించిన సీతమ్మ, 'అలాగే నాయనా...నిన్ను నేను మరీ ఇబ్బంది పెడుతున్నా ననుకోకు. పెళ్లికాడు మా వాడికి నువ్వేమీ చదివించనక్కర్లేదులే నాయనా...' అంటూ నవ్వి, 'వస్తానే సుబ్బులూ...' అని, 'చిట్టీ....ఇక మీ బావ దగ్గఱే నువ్వు చదువుకోవే..బాగా అబ్బుతుంది' అని ఆ పిల్లవైపు పకపక నవ్వుతూ చూసి ఇంటికి దారితీసింది.

చిట్టి, 'పో...మామ్మా....' అంటూ, లోపలి గదిలోకిపోయి, దుప్పటి కొంగు పుచ్చుకొని, పట్టెమంచంమీద ఒకసారి దొర్లింది. తీరా ఆమె తనకు తాను తెలుసుకునే స్థితికి వచ్చేసరికి, ఆమె నిండా దుప్పటి చుట్టుకొని ఉంది.

అత్తగారు అలా వెళ్ళగానే సుబ్బారావు ఆమె చాకచక్యానికి ఆశ్చర్యపోయినా, 'పెళ్ళినాడు కట్నంగా ఏమీ ఇవ్వక్కర్లేదులే నాయనా' అన్న ఆమె మాటకు ఎంతో బాధపడిపోయాడు. ఇందమ్మంటే అందమ్మలా మాట్లాడిందే కాని, ఎక్కడా ఏకోశానా అపేక్ష ఉండి మాట్లాడినట్లు

అకాలనెరసి బట్టను అపుటకు
కాశ్మీర్ - కుసుమం
మీ ఇష్టమైన మానెలో నావచ్చింది
యునైటెడ్ కెమికల్సు, బందరు రోడ్డు, విజయవాడ.
వర్ష ఉపద్రవములకు, అపాయములకు
అత్యుత్తమైన సుగంధ ములాము
సాంటలకస

లేదని లోలోన ఏమిటోలా అయిపోయాడు.

ఇక సీతమ్మపని ఇప్పుడు బాగానే ఉందని చెప్పాలి. ఆమె చక్కగా గేదె నొకటి కొంది. దాని పాలు పూర్తిగా ఒక్క చుక్కైనా మిగలకుండా పిండి, వాటిలో తనకు తృప్తితీరినన్ని నీళ్ళు కలిపి, పాలపొడి చల్లి, శేరు పదణాలకు తక్కువ కాకుండా అమ్ముతూంది.

కొడుకు సినిమాలు అవీ చూడటానికి ఉబలాటపడితే, అతన్ని గట్టిగా మందలిస్తూంది. వాడు స్నేహితులతో తిరిగి ఇంటికి తిన్నగా వేళకు రాకపోతే గట్టిగా కేకలేస్తూంది. సాయంకాలం పిల్లలకు ప్రైవేటు చెప్పమని అతన్ని పీక్కుతింటూంది.

వాడి బుద్ధి ఎప్పుడూ చదువుమీదే లగ్నమయి ఉండేందుకు, అప్పుడప్పుడో పాఠం చెపుతూంది. 'మీ బావ పైకి అలా ఉంటాడుకాని, వట్టి కుళ్ళుబోతురా... నువ్వు బి. ఏ. వరకూ చదవడం అతనికి ఏనేమీ ఇష్టంలేదు. చిట్టినికూడ నీకు అతనికివ్వాలని లేదు, ఏమనుకుంటున్నాడో... అక్కను రోజూ రాత్రిళ్లు చంపుకుతింటూ వుంటాడు. మీ అమ్మగారికి నువ్వు మా సంసారాన్నంతా దోచి పెడుతున్నావు. నీకు సిగ్గులేదూ..అంటూ ఆడదానిలా దాన్ని సాధిస్తూ వుంటాడు. నువ్వు తిన్నగా చదివక పరీక్షల్లో డింకీలు కొట్టావంటే, ఈకాస్త సహాయంకూడా చెయ్యడు. పెద్దపులిలా నేనున్నాన్లే నాయనా ఈ సహాయం. మీఅక్కకసలు తలలో నాలుకే లేదు. అతనంటే హడలిపోతుంది. నువ్వు చదివి ఉద్యోగాలు చేస్తావనీ, వూళ్లు ఏలుతావని, నన్నింత సుఖపెడతావని నేనేదో ఆశపడుతూ వుంటే, మరి నువ్విలా తిరుగుతూ వుంటే ఎలారా మరి...మన తాహతెంత... మనమెంత ... మనరోజులు బాగులేవురా నాయనా...' అని హెచ్చరించేది.

పాపం రామారావు తల్లి పడుతూన్న కష్టాలను పూర్తిగా అవగాహన చేసుకున్నాడు. తల్లికిసుమంతకూడ కష్టం కలిగించగూడదని మనసులో నిర్ణయించుకున్నాడు.

తల్లిని ఎప్పుడు సుఖపెడతానా ... ఎప్పుడు సాటివారిలో తలెత్తుకొని తిరిగేట్టు చేస్తానా ... అని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండేవాడు. రాత్రిళ్లు అతని కప్పుడప్పుడు ఈ విషయాల మీదే కలలు వచ్చేవి. తను పెద్ద ఆఫీసరు అయినట్లు, తల్లిని పట్టుదిళ్ళ మధ్య కూర్చుండబెట్టి, బంగారుపళ్లెంలో పంచభక్ష్యపరమాన్నాలూ తను తీసుకపోయి ఆమెకు పెడుతున్నట్లు, ఏవేవో తియ్యని కలలు కనేవాడు.

ఇక తనతల్లి. అంటే, ఆ ఇరుగు పొరుగు వాళ్ళకెందు కింతద్వేషమో అర్థంకాక తెగ నలిగిపోయేవాడు. తన తల్లికున్న తెలివి కాని, లౌకికజ్ఞానం కాని, సమయస్ఫూర్తి కాని ఆ వీధిలో ఒక్కరికి లేదని ఎప్పుడూ మురిసిపోయేవాడు. ఇంత చదువు చదువుతూన్న తనకుకూడ, తల్లి మాట్లాడుతూన్న మాటల్లోని అర్థం ఎంతో ఆలోచిస్తేకాని, అర్థంకావడంలేదు. నిజంగా అమ్మే... చదువుకొని ఉంటే ఈ దేశాన్ని పాలించేది కదూ...' అనుకొని ఏమిటో పిచ్చిగా లోలోన మురిసిపోయేవాడు.

3

సీతమ్మ ఆ నాలుగుసంవత్సరాలు నాలుగు రోజులుగా కాకపోయినా, ఏమంత కష్టం లేకుండానే దాటేసింది. తనుచేసిన ఘనకార్యానికి ఆమె మనసునిండా సంతోషించింది. ఇటు కొడుకు బి. ఏ. ఫస్టు క్లాసులో ప్యాసయ్యాడు. అటు చిట్టి స్కూలుఫైనలు ప్యాసయింది ఇక తన కష్టాలు కాటికి చాచుకున్నట్లే అనుకుంది. సుఖాన్ని సృష్టించుకున్నాను అనుకుంది. కాని ఏమిటో చిట్టి అనుకున్నంతగా ఎదగలేదు. దాని కళ్ళల్లో కాంతి తప్పించి శరీరం పుష్టిగా లేదు. ఆమె ఇంకా వ్యక్తురాలు కాలేదు. పీలగా ఉంటోంది. ఏమిటో ఎప్పుడూ ఆలోచిస్తూ కూర్చుంటుంది అనుకుంది.

ఇది ఇలా ఉండగా, అనుకోని సంఘటన ఒకటి జరిగింది. దీనితో పరిస్థితులన్నీ మారిపోయాయి ఒకరోజున ఆమె అల్లుడుగారి లారీ ఒక వంతెనమీదినుంచి క్రిందకు తిరగబడింది. లారీ ఇంజనుతో సహా ఎందుకూ పనికిరాకుండా పోయింది. థర్డ్‌పార్టీ ఇన్సూరెన్సు కట్టడంవల్ల రావలసిన పరిహారం రాకుండాపోయింది. దీనితో పచ్చగా కనిపించిన సంసారం ఒక్కసారి విషవాయువులు సోకిన చెట్టులా మాడిపోయింది.

ఈవార్త వినగానే సీతమ్మ గుండెలు కొట్టుకున్నాయి. కాళ్లు తడబడ్డాయి. ఆమె మనస్సు పరిపరివిధాల పోయింది. తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లయింది. అల్లుడు దగ్గఱకుపోయి అతనికి ధైర్యం చెప్పింది.

'విచారించకుబాబూ ... పోయిందాన్ని మనం తిరిగి ఎలాగూ తీసుకరాలేం...నువ్వు సరిగ్గా తలచుకోవాలే గాని, ఇలాంటి లారీలు ఓ వెయ్యి మూడోనాటికి కొని పారెయ్యవూ' అంది.

ఆ అల్లుడు పాపం అమాయకంగా 'నా దగ్గఱ ఏముందండీ కొనడానికి...బోలెడన్ని అప్పులున్నాయి' అన్నాడు రుద్ధకంఠంతో.

'అలాగా నాయనా......' అంటూ ఆ అత్తగారు కూతురుదగ్గఱ కూర్చొని, 'అయ్యో తల్లీ నీ కెంత కష్టమొచ్చిందే...' అని కాస్సేపు కళ్లు ఒత్తుకొని, చిట్టిని పలుకరించి, 'ఇక్కడికివ్వాళ మీ మావయ్య వచ్చేడటే...' అని ప్రశ్నించింది. చిట్టి, 'వచ్చేడు మామ్మ...ఇప్పటివరకూ ఇక్కడే ఉన్నాడు' అంది. 'సరే. వస్తానే...నువ్వు కూడ అలా మతిపోయినదానిలా తగలబడక, మీ అమ్మకు కొంచెం ధైర్యం చెప్పు. పోయినదానిగురించి అలా బెంగ పెట్టుకపోతాలేం...' అంటూ చల్లగా ఇంటికి జారుకుంది.

ఆవేళ సీతమ్మ మనసు మనసులో లేదు. ఆమె తీవ్రంగా ఆలోచించింది. ఆ ఆలోచనల తీవ్రతలో మూర్ఛపర్యంతమూ అయింది. ఇటు కొడుకు...అటు కూతురు...ఆమెలో కదలసాగారు. ఆమె తను ముళ్ళ చీకటికోనేటిలోనికి త్రోసివేయపడుతూన్నట్లు హడలిపోయింది. నేనేం పాపము చేశాను తండ్రీ...మాకీ శని అనుకుంది. 'ఈ కష్టాల్లోంచి మమ్మల్ని సుఖంగా బయటకు నెట్టివేయి బాబూ' అని భగవంతుని ప్రార్థించింది.

4

ఇది ఇలా ఉండగా, ఆ వూళ్లో పెళ్ళి

సిద్ధముగా ఉన్నది

టామ్‌సాయర్ ప్రపంచయాత్ర

అనువాదం :

నండూరి రామమోహనరావు

వెల రు 2-0-0

తపాలాఖర్చు ప్రత్యేకము

ఆంధ్రగ్రంథమాల - మద్రాసు 1.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

పిల్లల ప్రత్యేక సంచిక : ముఖ్యగమనిక

దసరాకు బదులు దీపావళికి వెలువడుతుంది.

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక పిల్లల ప్రత్యేక సంచిక ఏటేటా దసరాకు ప్రచురించబడుతున్నది, అదేవిధంగా ఈ సంవత్సరం కూడా ప్రకటించడం జరిగింది. కాని కారణాంతరాల వల్ల ఈ సంవత్సరం పిల్లల ప్రత్యేక సంచికను దీపావళికి ప్రచురించడం జరుగుతున్నదని పాఠకులు, ఏజెంట్లు గమనించ ప్రార్థన. దసరా పండుగకు మామూలు సంచిక ప్రచురించబడుతుంది. పిల్లలు పంపిన రచనలు, చిత్రాలు మొదలైనవి దీపావళికి ప్రచురించబడతాయి.

రచనలు పంపడానికి సెప్టెంబరు 20.వ తేదీ గడువుపెట్టి ఉన్నాము. పోటీకి పంపే పిల్లల రచనల్ను మాత్రం ఇకపైన స్వీకరించజాలము. ఇతరుల రచనలకు గడువు అక్టోబరు 20 వ తేదీ. దీపావళి వ్యాసాలు, చిత్రాలు, ఫొటోలకు కూడా అక్టోబరు 20 వ తేదీ వరకు వ్యవధి ఉన్నది.

— సంపాదకుడు.

★ సీతమ్మ తల్లి ★

కొడుకులకోసం, వినికి వేసారిపోతూన్న ఆడపిల్లలుగల తలిదండ్రులకు షష్టుక్లాసులో బి. ఏ. ప్యాసయిన పెదవాడైన రామారావు ఆశాజ్యోతిగా కనిపించాడు.

'ఎవరయ్యా ఈ రామారావు' అన్నాడు వరసన్నతో వీరయ్య షావుకారు.

వరసన్న, 'మీకు తెలియదులెండి...... సీతమ్మ అని ఓ వితంతురాలుంది. అతను ఆవిడ కొడుకు' అన్నాడు.

'ఏవరయ్యా ఆ సీతమ్మ' అన్నాడు తిరిగి వీరయ్య.

'ఈమధ్య లారీ తిరగబడలేదూ...ఆ సుబ్బారావు అత్తగారండీ...'

'ఓహో సుబ్బారావత్తగారా....సుబ్బారావు నాకు బాగా తెలుసు. అయితే అతనికో కూతురున్నట్లుందే......ఉన్నట్లుండట మేమిటి నా బొంద...స్కూలుఫైనలుకూడ ప్యాసయిందని చెప్పినట్లు గుర్తు.'

'అవును...అది నిజమే గాని, మరి ఇప్పుడతనిదగ్గిర చిల్లిగవ్వకూడ లేదు. ఎంత అప్పుగారి కూతురైతేనేం ఆ కుర్రాడు కట్నం, గిట్నం లేకుండా పెళ్ళాడుతాడటండీ....

'అదేమిటయ్యా అలా అంటావు. మేనగోడల్ని కూడా చేసి మనదాకా వస్తాడంటే నే నమ్మను.'

'మీకు పిచ్చి గాని......మేనగోడలేమిటండీ ఈ రోజుల్లో......డబ్బే మేనగోడలండీ...... బంధుత్వాలు గింధుత్వాలు జాంతానై. కట్నం సుమారుగా చేతిలో పడితే సరి..అందులో సీతమ్మ డబ్బాశ మనిషండీ...మనం కదిపి చూశామంటే పడకపోదు.'

'నాకు నమ్మకం లేదు; కూతురు నెత్తిమీద చెయ్యి పెడుతుందంటే...'

'అయితే కొడుకు నెత్తిమీద చెయ్యి పెడుతుందంటారా ... ఇప్పుడల్లుడిదగ్గర ఏమీ లేదు. చూసిచూసి కొడుకును గోతిలో దింపుతుందటండీ... మీకా బెంగ అనవసరం. ఫైసల్ చేసేవాడిని నేనున్నానుగా. ఆ విషయం నా కొదిలేయండి.'

'మరీ అంత హెచ్చుగా పెట్టేయక; ఉద్యోగం చూపిస్తానని, కట్నం పదివేలిస్తామని చెప్పు. అంతకు పైనైతే మనం భరించలేం.'

'సరే వస్తా.'

'ఇదిగో మాట. మరి మన అమ్మాయికి మన మిచ్చేదానికి, కొంచె మించుమించుగా వాళ్ళూ పెట్టాలి తెలుసా....'

'ఏమిటీ...మనమ్మాయికా...అట్బే ఇలాగైతే లాభం ఉండదు. మళ్లీ ఇలాంటి తిరకాసు పెట్టకండి అసలుకే మోసం వస్తుంది. మీకు తెలియందేముంది; గద్దల్లా తన్నుకపోయేవాళ్ళు ఎంతిమంది మనకు పోటీగా ఉన్నారో....'

'సరే...ఏం చేస్తాం...'

వీరయ్యగారి దగ్గిర సెలవుతీసుకొని, వరసన్న కార్యసాధనార్థం అక్కడనుంచి ధీమాగా నడక సాగించాడు.

5

సీతమ్మ ఒక రాత్రి రాత్రంతా ఆలోచించింది. పదివేల రూపాయలు ఆమె కళ్లముందు మెరిశాయి. ఎమ్. ఏ. వరకూ చది



పూరి, చందన్‌తలాబ్‌లో నరేంద్ర దేవాలయం ఫొటో: కమరుద్దీన్ ఖాన్—కటక్.

వించమని పట్టుబడితే సరి అనుకుంది. వ్యవహారం మెత్తబడేట్లుగానే ఉంది. అని దృఢపఱచుకుంది. తను ఇక కొద్ది సంవత్సరాల్లో కలక్టరుగారి తల్లిగా మారిపోతున్నట్లు, ఇంకా ఏమేమిటో అయిపోతున్నట్లు ఊహించింది. 'నా కొడుకు ఎంత అదృష్టవంతుడు!' అనుకుంది. అప్పుడే కూతురు గుర్తుకొచ్చింది. వెంటనే 'అమ్మ పెట్టా పెట్టదు. అడుక్కు తిననివ్వదని—వాళ్లు ఇవ్వాలేరు. ఇచ్చేవాళ్ళదగ్గఱ పుచ్చుకోనూ పుచ్చుకోనివ్వరేమిటి...' అనుకుంది. 'దీని లోని సంగతి సందర్భాలన్నీ బాగా నచ్చజెపితే సరి. అల్లుడు మండిపడతాడేమో... మండితే మండుతాడు. మనకేం...ఎవరు మండితే వాళ్లే తగలబడతారు. ఎప్పుడు డబ్బిచ్చినా ఏడుస్తూనే ఇచ్చాడు కాని, ఒక్కసారిగాని నవ్వుతూ ఇచ్చాడా... చిట్టికేం...దాని పెళ్ళి నిక్షేపంలా అయిపోతుంది. స్కూలు ఫైనలు ప్యాసయింది. దాన్ని ఎవడుబడితే వాడే ఎగరేసుకపోతాడు. అనుకుంది.

మరునాడు కూతురువద్దకు వెళ్ళింది. తమ్ముడి పెళ్ళివ్యవహారం తల్లి అప్పుడే చాల దూరం తీసుకొచ్చిందని ఆనోటా ఆనోటా బడి తనదాకా వచ్చినమాటలనుబట్టి సుబ్బులు తెలుసుకుంది.

'అమ్మా నాకన్యాయం చేస్తావటే...' అని భోరున ఏడ్చింది. 'ఇన్నాళ్లు తమ్ముడు చేసుకుంటాడనికదే ఆశపెట్టావు. ఇప్పుడు వాడు చేసుకోకపోతే, మేనమామ ఎందుకు చేసుకోలేదని అపవాదు వెయ్యరటే...మా స్థితిచూసి నువ్వే ఇలా చేస్తే .... ఇక మేం ఎప్పటికైనా దాని పెళ్లి చెయ్యగలమటే...' అని విలపించింది.

సీతమ్మ మెల్లగా గుండెల్ని చిక్కబట్టుకుంది. 'అదేమిటే అలా అంటావు... పిచ్చిదానా...చిట్టికి నేను మూడు నిముషాలల్లో చేసెయ్యనటే ... దానికేమే రత్నాలబొమ్మ. దానిగుణం, దానిచదువు, ఈ వీధిలో ఎవరికున్నాయే... వాడేమిటో పిచ్చికుంక... మేనగోడలిని పెళ్లిచేసుకోవడమేమిటే...అమ్మా ... రోజూ దానితో, నువ్వు నువ్వా అనిపించుకొని, ఒక్కచోట అన్నా చెల్లెళ్లలాగ తిరిగి ఇప్పుడు దాన్ని పెళ్లాడితే ... ఏమిటో అదోలావుంటుందే ...అంటున్నాడు. నేనేమిచెయ్యనమ్మా ... ఇప్పటి కాలపువాళ్ల ఉద్దేశాలు ఇలా అధ్వాన్నంగా ఉంటాయని...వాడు వద్దు మొర్రో అంటూంటే ఇప్పుడు వాడిమెడను వేసి దాన్ని కట్టడం వాడికీ మంచిదికాదు. ...చిట్టికీ మంచిది కాదు. వాడింతకీ ఏమన్నాడో తెలుసా ... 'ఇప్పుడు బావ ఎల్లాగూ కష్టాల్లో ఉన్నాడుకదా...వాళ్లు మనకు పదివేలెలాగూ ఇస్తారు. అందులో కొంత బావకిచ్చి వ్యాపారం చేయించుదామమ్మా....అటు బావా బాగుపడతాడు. ఇటు మనకూ తృప్తిగా ఉంటుంది'

★ సీతమ్మ తల్లి ★

అన్నాడు. చిత్రం ... నా కిలాంటి ఆలోచనే తట్టలేదు. వాడిబుద్ధి ఎంత గొప్పదనుకున్నావు. చిన్నవాడైనా చెప్పింది మన మంచికే. అయినప్పుడు వినాలమ్మా...' అంటూ ఇంకా ఏమేమిటో చెప్పబోతూన్న అత్తగార్ని - గదిలోంచి ఈ మాటలన్నీ వింటూన్న అల్లుడు గబగబా అక్కడనుంచి పరుగెత్తుకవచ్చి విపరీతమైన ఆవేశంతో 'వెళ్లు ముందు ఇక్కణ్ణుంచి...పిశాచ ప్రేలాపన పేలక' అన్నాడు.

సీతమ్మకు ఇల్లాంటివ్యవహారం కోపంలో గాని తెగతెంపులు గాదని బాగా తెలుసు.

'ఎందుకునాయనా అంతకోపం...వాడు మాత్రం ఏమన్నాడని...' అంది.

అల్లుడు సుబ్బారావుకు కోపం ఇంకా ఆగలేదు. పైపెచ్చు అది రెట్టింపయింది. అతను ఒక్కసారిగా, 'వెళ్తావా...' అని అరిచాడు.

దానితో, సీతమ్మ, 'పోతాను నాయనా పోతాను. మంచిచెప్తే, చెడ్డ ఎప్పుడూ ఎదురౌతుంది. పెద్దవాళ్లెప్పుడూ, చెడ్డవాళ్లు కారులే...' అంటూ అక్కడనుంచి ఇంటికి దారితీసింది.

గదిలోఉండి, మామ్మ చెపుతూన్న ఈ మాటలన్నీ విన్న చిట్టి, ఆమె ధోరణికి నిలువెల్లా కంపించిపోయింది. 'నిజంగా మావయ్య అట్లా అన్నాడా...అబద్ధం...అబద్ధం...' అనుకుంది. తమ్ముణ్ణిపిలిచి 'మావయ్యను అమ్మ పిలుస్తూందని పిలుచుకరా' అని పంపింది.

సీతమ్మ గబగబా ఇంటికి చేరింది. చేరిన వెంటనే గట్టిగా ఏడుపుకు లంకించుకుంది. 'ఏమిటే అమ్మా ... ఏమిటే...' అంటూ రామారావు విస్తుపోయాడు.

'ఎందుకునాయనా నేను బ్రతికి... అడ్డమైన వాళ్లతోనూ మాటలు పడటానికేగా ఇంత బ్రతుకూ బ్రతికి ఒకడితో నేను మాటలు పడటమూ...నా కొడుకు నాకు లేడూ... నన్ను పోషించడానికి. వాడి సొమ్మేం తిని మేం బ్రతికామని' అంటూ రాగాలు తీయడం మొదలు పెట్టింది.

రామారావు తల తిరిగింది. 'ఏమిటమ్మా ఏమిటయింది' అంటూ తిరిగి ప్రశ్నించాడు అయోమయంగా.

'అదికాదు నాయనా...ఇలాంటివాడని తెలిస్తే, అక్కడకు నేను వెళ్ళకనే పోదును. అతన్ని బాగు చెయ్యాలని నేను అనుకోవడమేమిటి .... అతను నన్ను కొట్టడానికి రావడమేమిటి....' అంది.

రామారావు కుతకుత ఉడికిపోయాడు. ఎవడమ్మా ఆవెధవ ... నిన్ను కొట్టడానికి వాడికన్ని గుండెలున్నాయి'

'ఏమి చెప్పను నాయనా ... అంతా నా గ్రహచారం. చెప్పుకుంటె సిగ్గుచేటు.'

'అబ్బ! చెప్పమ్మా...ఎవడా వెధవ...'

'మీ బావరా నాయనా .. మీబావ.... దిగుతావా దిగవా గుమ్మం అంటూ చెయ్యెత్తాడు.'

'ఆఁ...ఏమిటే...' అంటూ రామారావు ఒక్కసారి తలక్రిందులైపోయాడు.

ఇంతలో బాబు వచ్చి, 'మావయ్యా... అమ్మ ఒకసారి నిన్ను రమ్మంటూంది' అంటూ పిలిచాడు.

వెంటనే సీతమ్మ, 'కావలిస్తే వాడి నడగరా...చిన్నవాళ్ళ నోటిలో దేవుడుంటాడు. ఏం బాబూ...మీ నాన్న నన్నేమన్నాడనిరా...చెయ్యెత్తాడు' అంది.

బాబు, తండ్రి చెయ్యెత్తడం గమనించనేలేదు. కాని అతను గట్టిగా అరవడంమాత్రం అతనికి తెలుసు. ఆ అరుపు చెవ్వోతినట్లే ఉంది. కాని ఎందుకలా అరిచాడో వాడికి సంగతి సందర్భాలు అర్థంకాలేదు. అమ్మమ్మ కాంతంగా ఏమిటో చెప్తూంటే, నాన్న ఎందుకలా విఱుచుకపడ్డాడో......ఆ పసివాడు ఊహించలేకపోయాడు. వాడు బిత్తర చూపులతో, మామ్మవైపు, మావయ్యవైపూ చూస్తూ ఉండిపోయాడు.

వెంటనే రామారావు, 'ఏరా...మీ నాన్న చెయ్యెత్తాడా...' అన్నాడు.

బాబు కేమిటో ఈ పాడుగోల అర్థం కావడం లేదు. ఇంటిదగ్గఱ చూస్తే అలాగున్నారు. ఇక్కడ చూస్తే ఇలాగున్నారు. వాడు, తండ్రిపక్షాన నిలబడి మాట్లాడాలనుకున్నాడో, ఏమో మెల్లగా, 'మామ్మ... ఏదో అంది' అన్నాడు ఉడుకుబోతుతనంగా.

వెంటనే సీతమ్మ 'నే నేమన్నానురా.... నువ్వు నిజంగా చెప్పు...' అంటూ వాడివైపు తీక్షణంగా చూసింది.

వాడికిదంతా చాల చికాకుగా కనిపించిందో ఏమో......'ఏమో...నాకు తెలియదు...' అంటూ బిక్కమొగమేశాడు.

అప్పుడు రామారావు 'అసలు బావ ఎందుకమ్మా చేయెత్తాడు' అని తల్లిని ప్రశ్నించాడు.

వెంటనే సీతమ్మ, ఎందుకేమిటి నాయనా...కిట్టనివాళ్లెవరేమి చెప్పారో ఏమో...చిట్టిని నువ్వు పెళ్ళిచేసుకోనని అన్నావుట. మేనగోడలిని పెళ్లాడితే చెవులు పుచ్చుకొని వేళ్లాడుతుంది. రాచిరంపాన పెడుతుంది. అయినా ఇప్పుడు మా కావ ఏం ఇస్తాడేమిటి...తింటానికే వాళ్లకు గతిలేదు అన్నావట' అంది.

బాబుకు అప్పుడు ఏదో జ్ఞాపక మొచ్చినట్లయింది. కాని అదికూడ పూర్తిగా కళ్లకు కట్టలేదు. మనసులో స్థిరపడలేదు. కాని, 'అదికాదు మావయ్యా...మామ్మ ఏమందో తెలుసా....నువ్వు కట్నం పుచ్చుకొని, మా నాన్న వ్యాపారం చెయ్యడాని కిస్తావని అంది' అన్నాడు.

వెంటనే సీతమ్మ, 'నిజం చెప్పావు నాయనా...నువ్వు దల్లగా వెయ్యేళ్ళు వర్ధిల్లాలి. మీ బావ ఎవడో వాజమ్మ మాటలు పుచ్చుకొని, అలాగ వాగుతూంటే మానసం చంపుకొని, ఊరుకోలేకపోయాను నాయనా ...అవును...నీకూ గతిలేక, వాడికీ గతిలేక ముష్టిపీనుగుల్లా బ్రతకాలనా...నీ ఉద్దేశం.. జోగీ జోగీ రాసుకుంటే బూడిద రాలిందని- బావను ఈ కష్టకాలంలో ఆదుకోవాలని అనుకున్నాడో ఏమో ... అంతమాత్రాని కింత కోపమెందుకు నాయనా...అన్నాను. అంతే...పోతావా పోవా...గుమ్మం దిగు.. ఒకటే మాట. ఇంతేకాని మనమాట వినిపించుకోడే...ఇంత కోపిష్టివాడి సంబంధం చేసుకొని ఏం బావుకుంటావురా నాయనా' అంది.

రామారావు పెదవి వణికింది. వెంటనే బాబుతో, 'పోరా...ఫో....ఇక్కడ మీ ఇంటికొచ్చేవాళ్లెవరూ లేరు. మీ బాబును లెక్క చెప్పమను...అణాపైసలతో ఇచ్చి పారేస్తానన్నాడని చెప్పు' అన్నాడు ఎంతో ఆవేశంతో.

బాబు చేసేదిలేక అక్కడనుంచి బిక్కమొగంతో ఇంటికి దారితీశాడు. వాడికి అక్కడ విన్న మాటల్లో ఒక్కటీ సరిగా గుర్తు ఉండటం లేదు. 'మావయ్య అన్న మాటలు జ్ఞాపకం ఉంటున్నాయి కాని, మామ్మ అన్న మాటలు ఏమిటో ఒక్కటీ తిన్నగా జ్ఞాపకం ఉండటంలేదు' అనుకున్నాడు.

మనమడు వెళ్లిపోగానే సీతమ్మ కొడుకుతో మెల్లగా, 'నువ్వంతమాట ఒక్కసారి అనగూడదు నాయనా ... పెద్దదాన్ని నేనంటే ఎలాగైనా సర్దుకోగలను.' అంది.

రామారావు ఈమాటలతో పూర్తిగా మారిపోయాడు. 'ఏడ్చాడులే. చదివించినంత మాత్రాన, మన మేమైనా అతనికి బానిసలమా...అతనిష్టమొచ్చినట్లు చలాయించడానికి' అన్నాడు.

'అదికాదు నాయనా...అవతల అక్క ఉంది కదూ ... దానికోసమైనా మనం కొంచెం నిగ్రహించాలి.' అంది ఆతల్లి!

రామారావు పసిహృదయం తల్లి మాటలోని ఆంతర్యాన్ని పసికట్టలేక పోయింది. 'ఛీ ... ఇలాంటివాడి సంబంధం చస్తే చేసుకోగూడదు. వాళ్ళకెప్పుడూ మా సొమ్ము తినేశారు...మా సొమ్ము తినేశారు ...అనే ఏడ్పుగా ఉంటుంది. పెళ్లయిన తరువాత, చిట్టి ఇలాంటిమాటలతో దెప్పిపొడించిందంటే, నేను సహించలేను కూడాను' అన్నాడు.

సీతమ్మ ఒక్కసారి పూర్తిగా గాలిపీల్చు కుంది. 'ఇక్కష్టాలు' అనుకుంది. అంతా సక్రమంగా జరిగిపోయినందుకు తనను తనే అభినందించుకుంది. ఇటు తిరిగే చక్రాన్ని అటు త్రిప్పగలిగాను కదా...అని సంతోషించింది. ఆమె కళ్లల్లో వింతజ్యోతి మెరిసింది.

అమరునాడు ఆమె అనుకున్న కార్యం సులువుగానే జరిగిపోయింది. వీరయ్యగారి పిల్లనిచ్చి పదివేలకట్నంతో రామారావుకు వివాహం చేయడానికి నిశ్చయమైపోయింది.

6

సీతమ్మ, పెళ్ళి అయ్యేవరకూ, కొడుకును వేయి కళ్ళతో కాపాడుకోవాలని నిర్ణయించుకుంది. ఏ నాడు ఎవరు వచ్చి ఏమి చెప్పినా, రామారావు మనసు చిట్టివైపు మరలిపోవొచ్చు.

ఒక రోజున ఆమె భయపడినట్లుగానే జరిగింది. బాబు వచ్చి వాళ్లమావయ్యకేదో ఉత్తరం ఇచ్చి వెళ్ళిపోయాడు. 'ఏమిటి నాయనా అది' అంటే రామారావు చెప్ప లేదు.

రామారావు ఆ ఉత్తరం పూర్తిగా చదివాడు. అది చిట్టి వ్రాసింది. అందులో నాలుగే నాలుగు ముక్కలున్నాయి. కాని అవి అతని హృదయాన్ని పట్టుకొని, తల క్రిందులు చేసిపారేశాయి. 'మావయ్యా... లెక్క చెప్తే నువ్వు డబ్బు ఇచ్చేస్తానన్నావట. నీ ఉదార స్వభావానికి చాల ఆనందమయింది. అన్న మాటప్రకారంగా నువ్వు తప్పకుండా ఆ డబ్బు తిరిగి ఇస్తావు కూడాను. కాని...అన్ని విషయాల్లోనూ నువ్వు అలా అంత ఉదారతను ప్రదర్శించగలవా...మావయ్యా......క్షమించు మావయ్యా ఇలా వ్రాసినందుకు' అని వ్రాసింది.

ఇది చదివిన తరువాత అతను ఒకవిధంగా మారిపోయాడు. ఏమిటేమిటో ఊహించాడు. కాని మాట ఇచ్చేసిన తరువాత ఇప్పుడెలా...తల్లిముందు ఏమిటో ప్రేలుడు బొమ్మలా తను మాట్లాడేశాడే కాని నిదానంగా ఆలోచించి మాట్లాడలేదు. ఎందుకు చదువు, కాల్పనా...అనుకున్నాడు.

సీతమ్మ, ఆ ఉత్తరం చూసినప్పటినుంచీ కొడుకు అదోలా ఉండడం గమనించింది. ఏమి మాట్లాడితే ఏమి వస్తుందో అని భయపడింది. 'ఏమైనా కొడుకు మాటఇచ్చాడు. ఆ మాట ఇంకెలాగూ తప్పలేదు. ఇంక తన చేతుల్లో ఏముంది. పెళ్ళికి ముహూర్తం కూడ పెట్టేశారు. ఇంకెలా తప్పించుకపోతాడు అని మనసును కుదుటబఱచుకుంది.

కూతురును అల్లుణ్ని పెళ్లికి ఆహ్వానించింది. చిట్టిని రమ్మని బ్రతిమాలినట్లు మాట్లాడింది. కాని, పెళ్లికి వాళ్లెవ్వరూ రాలేదు.

పెళ్లిపీటలమీద కూర్చున్నాడన్న మాటే గాని రామారావు మనసు మనసులోలేదు. తను చిట్టికి అన్యాయంచేసినట్లుగా పూర్తిగా నిర్ణయించుకున్నాడు. బావకు ఎంతో ద్రోహం చేసినట్లు తలవంచాడు. స్వయంగా తన స్వంతఅక్కకు కడుపులో చిచ్చుపెట్టినట్లు కుమిలిపోయాడు. ఆరోజున తనకంత బలహీనత ఎట్లా వచ్చిందో అని ఆశ్చర్యపోయాడు. తల్లిపన్నిన పన్నాగమంతా ఇప్పుడు కళ్లకుకట్టినట్లుగా కనబడుతూండడం గమనించాడు. 'అబ్బ! డబ్బు...తల్లినీ...కూతురునీ ఎలా విడదీసింది! అమ్మకు పేదరికమంటే ఎంతభయం! ఆ భయమే ఆమెనిట్లా అన్యాయాల్లోకి తరిమింది. అయ్యో నాకు జ్ఞానంలేదు. అమ్మగుణాన్ని కనిపెట్టలేకపోయాను. అక్క...బావా...తమను ఆదుకోకపోతే తాము ఏమైపోయేవాళ్లు...ఏ అన్న కూడ చూడనివిధంగా అక్క సాయపడిందే...బావ తనకూ....తన చదువుకూ ఎంత డబ్బు ధారపోశాడు...ఈనాడు వాళ్లు చిడికిపోయారని అమ్మ ఇట్లా చేస్తుందా ... అమ్మచేస్తే .... తను కూడ అట్లాగే చెయ్యాలా...అయ్యో! తను చిట్టిని తన హృదయంలోని మూర్తినికూడ ఎట్లా మఱచిపోయాడు...ఏం అన్యాయం చేసింది? నాకు ఏ శిక్ష విధించినా పాపంలేదు. నా కళ్లు మూసుకపోయాయి. నేను మనిషిని కాను. నేను మనిషినికాను' అని ఏమేమిటో అనుకుంటూ కృంగిపోతున్నాడు.

అప్పుడే బాబు అక్కడకు పరుగెత్తుకుంటూవచ్చి 'మావయ్యా...మావయ్యా...అక్క...నూతిలో పడిపోయింది మావయ్యా....' అంటూ వాడు ఒక్కసారిగా ఏడ్చేశాడు.

ఆ పెళ్లిలో బంధువులు, పురోహితుడు, పెళ్లికూతురు, ఆమె తండ్రి అందఱూ ఒక్కసారి తెల్లపోయారు. వెలుగుతూన్న విద్యుద్దీపాలు, సువాసనల వ్రేలాడుతూన్న మామిడి తోరణాలు, పచ్చగా మెరుస్తూన్న కొబ్బరాకులు అన్నీ 'అయ్యో పాపం' అంటూ దుఃఖించాయి. ఆమాట వినగానే అందరి మనసులూ కలతచెందాయి.

'ఆఁ ...ఏమిటీ...' అంటూ రామారావు, 'అయ్యో చిట్టీ...ఎంతపని చేశావు....ఎంత పని చేశావు....' అంటూ అక్కడనుంచి పరుగెత్తాడు.

అక్కడ ఉన్నవారంతా ఒక్కసారి 'ఆఁ...ఆఁ...' అన్నారు.

రామారావు, 'భగవంతుడా ..మా చిట్టిని బ్రతికించు...మా చిట్టిని బ్రతికించు భగవంతుడా' అనుకుంటూ అడ్డువచ్చిన వాళ్లను త్రోసుకొని, అక్కడ ఎవరిదో సైకిలు ఉంటే, అది ఎక్కి అతను ఎంతో వేగంతో చిట్టిని కలుసుకోడానికి వెళ్ళిపోయాడు.

అప్పుడే సీతమ్మ 'అయ్యో చిట్టీ...ఎంత అఘాయిత్యం చేశావే....నువ్విలా చేస్తావని నే నెప్పుడూ అనుకోలేదే...' అంటూ 'ఒరే నాయనా...పోయిన వాళ్ళతో మనమూ పోతామటరా...నువ్విప్పు డక్కడకు వెళ్ళకూడదురా నాయనా...వాడ్ని ఆపండి..' అంది గగ్గోలుగా

ఈ మాటలు రామారావుకు వినబడలేదు. కాని అవి వినిపించినా అతనా తల్లిని తప్పక క్షమిస్తాడన్నదిమాత్రం నిజం! ★

హకల్ బెరిఫిన్
వెల రూ. 2-0-0
పోస్టుఖర్చులు అదనము.
ఆంధ్రగ్రంథమాల, మదరాసు-1,

ప్రఖ్యాత ఫ్రెంచి నవలాకారుడు
విక్టర్ హ్యూగో రచించిన
★ ఘంటారావం ★
నవలకు పుస్తకరూపంలో తెనుగు అనువాదం
అనువాదకులు సూరంపూడి సీతారామ్
వెల రు: 1-8-0 పోస్టుఖర్చులు ప్రత్యేకముగా
ఆంధ్రగ్రంథమాల,
మదరాసు-1.